క్లుప్తంగా

జమ్ము కశ్మీర్ మాజీ ఉప ముఖ్యమంత్రి పూజలు



ఆలయానికి వస్తున్న నిర్మల్‌సింగ్

ఖమ్మం మామిళ్లగూడెం: మహాజన సంపర్క్ అభియాన్‌లో భాగంగా శుక్రవారం ఉదయం జమ్ము కశ్మీర్ మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ నిర్మల్‌సింగ్ ఖమ్మంలోని శ్రీఅభయ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారి విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్ ఘన్‌పూర్ వెళ్లారు.ఆయన వెంట జిల్లా అధ్యక్షుడు గల్లాసత్యనారాయణ, ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, వేల్పుల సుధాకర్, ఈదుల వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

'వనజీవి'కి సన్మానం



రామయ్యకు పండ్లు అందిస్తున్న వ్యాపారులు

ఖమ్మంరూరల్: పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్యను రెడ్డిపల్లిలోని ఆయన నివాసంలో ఖమ్మంకు చెందిన ఓంసాయి బ్యాటరీస్ ప్రొప్రయిటర్లు డి. నర్సింహారావు, జీఎం. బాబుఅగర్వాల్‌లు శుక్రవారం కలిశారు. ఈసందర్భంగా రామయ్యకు మొక్క బహూకరించి ఘనంగా సన్మానించాక ఆయనకు పండ్లు అందజేశారు. రామయ్యను కలిసి వారిలో భానుప్రకాష్, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి దరఖాస్తుల ఆహ్వానం

రఘునాథపాలెం: మండలంలోని అర్హులైన దివ్యాంగులు సదరమ్ క్యాంప్‌కు హాజరు కావాలనుకున్నవారు నేటి(శనివారం) నుంచి మీ సేవా కేంద్రాల ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకోవాలని ఎంపీడీఓ రామకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్లాట్ బుక్ చేసుకున్న వారు ఈ నెల 20వ తేదీన ఖమ్మం ప్రభుత్వాస్పత్రిలో నిర్వహించే సదరమ్ క్యాంపుకు మీ సేవా స్లిప్, ఆధార్ జిరాక్స్, పాస్ ఫొటో తదితర వైద్య పరీక్షల కాపీలను తీసుకు రావాలని పేర్కొన్నారు.

ఇగ్నో కేంద్రం సందర్శన

ఖమ్మం సహకారనగర్: నగరంలోని కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాలలోని ఇగ్నో పరీక్షా కేంద్రాన్ని ఇగ్నో అసిస్టెంట్ రీజినల్ డైరెక్టర్ రాజు బొళ్ళ శుక్రవారం సందర్శించినట్లు సెంటర్ కోఆర్డినేటర్ దేవేందర్, కళాశాల ప్రిన్సిపాల్ రమణారావులు ఒక ప్రకటనలో తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయమందిస్తున్న మార్బుల్ యూనియన్ బాధ్యులు

రఘునాథపాలెం: మండలంలోని బూడిదంపాడుకు చెందిన తోకల వీరన్న అనే మార్బుల్ కార్మికుడు ఇటీవల తన మిత్రుడితో కలిసి ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. దీంతో కార్మికుడు కుటుంబానికి తమ వంతు సాయంగా నిలవాలని తోటి కార్మికులు, గ్రామానికి చెందిన పలువురు శుక్రవారం ఆర్థిక సాయమందించారు. ఇందులో మార్బుల్ యూనియన్ ఆధ్వర్యాన రూ. 12,500, గ్రామ కాంగ్రెస్ హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యాన మరికొంత ఆర్థికంగా ఆదుకున్నారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	50	బచ్చలికూర	2
వంకాయ	36		10
బెండకాయ	36	పాలకూర	3
పచ్చిమిర్చి	86		10
కాకర	50	చుక్కకూర	2
సొరకాయ	20		10
బీర	46	తోటకూర	2
దొండ	28		10
పొట్లకాయ	40	గోంగూర	2
చిక్కుడు	80		10
గోరుచిక్కుడు	46	మెంతికూర	5
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	18	కొత్తిమీర	1
ఆలుగడ్డ	24		15
చామగడ్డ	46	పుదీన	1
క్యారెట్	56		15
క్యాప్సికం	60	-ఖమ్మం వ్యవసాయం	

'మోటార్లు'..మాయం!

పొలాల్లోని విద్యుత్ మోటార్లను ఎత్తుకెళ్తున్న దొంగలు

- ఆందోళన చెందుతున్న రైతన్నలు
- సాగు పనులు మొదలయ్యే సమయాన అవస్థలు
- కంటికి కునుకు లేకుండా చేస్తున్న వైనం
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

మూలిగే నక్కమీద తాటిపండు పడ్డ చందంగా తయారైంది మండలంలోని రైతన్నల పరిస్థితి. ఓ వైపు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు మద్దతు ధర లేక, వ్యవసాయం గిట్టుబాటు కాక అప్పుల పాలవుతుంటే.. నెత్తిమీద పిడుగులా పొలాల వద్ద ఉన్న విద్యుత్ మోటార్లను దొంగలు ఎత్తుకెళ్తూ.. రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు. ప్రస్తుతం వరి, మిర్చి పంట కాలం పూర్తయినా.. ఇంకా కొంతమంది రైతులు కూరగాయల పంటలకు నీరు పెట్టే తరుణంలో మోటార్లు చోరీకి గురికావడంతో రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది.



కొన్ని మోటార్ల రికవరీ..

గతంలో మంగళగూడెంకు చెందిన రైతులు రాత్రి పంటలకు నీరు పెట్టేందుకు వెళ్లగా అక్కడ ముగ్గురు దొంగలు మోటార్ల వద్ద తచ్చాడుతున్నారు. దీంతో రైతులు ఒక్క ఉదుటున వెళ్లి దొంగలను పట్టుకునేందుకు ప్రయత్నించగా.. అందులో ఇద్దరు పారిపోగా.. మరో దొంగ రైతుల చేతికి చిక్కాడు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా.. దొంగను స్టేషన్‌కు తరలించి విచారణ చేశారు. అనంతరం అతడి వద్ద నుంచి కొన్ని మోటార్లను రికవరీ చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం పంట కాలాన్ని ముందుకు జరపడంతో ముందస్తుగా బావులు, బోర్ల ఆధారంగా వరిసాగు చేయాల్సి వస్తోంది. కానీ రైతులకు మోటార్ల దొంగల బెడదతో పొలాల వద్ద కాపలా కాస్తూ రాత్రింబవళ్లు తిప్పలు తప్పడం లేదు.

ఖమ్మంరూరల్: పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి, ఖమ్మంరూరల్ మండలాల్లోని పలు గ్రామాల్లో గత ఆరు నెలల కాలంలో 10 వరకు విద్యుత్ మోటార్లు దొంగలు ఎత్తుకెళ్లారు. ఎంవెంకటాయపాలెం, తనగంపాడు, పొన్నేకల్, ముత్తగూడెం, ఆరేకోడు, మంగళగూడెం, గూడురుపాడు తదితర గ్రామాల్లో రాత్రి వేళల్లో దొంగలు మోటార్లు ఎత్తుకెళ్లిన సంఘటనలు జరిగి ఆరు నెలలు గడవక ముందే తాజాగా పోచారం గ్రామంలో ఓ రైతుకు చెందిన విద్యుత్ మోటార్ చోరీకి గురైంది. దీంతో కూరగాయల పంటలు చేతికందే సమయాన పంటలకు నీరందించలేక నానా అవస్థలు పడాల్సి వస్తుందని బాధిత రైతులు వాపోతున్నారు.

మరో మోటార్ కొనలేక..

అసలే అప్పుల ఊబిలో ఉన్న రైతులకు.. ఉన్న పలంగా మోటార్లు చోరీకి గురవుతుంటే ఏం చేయాలో పాలుపోక లబోదిబోమంటున్నారు. అలా అని కొత్తగా మరో మోటార్ కొందామంటే ఆర్థిక స్తోమత లేక నానా అవస్థలు పడుతున్నారు. ఒక్కో రైతుకు చెందిన రెండు మోటార్లు ఎత్తుకెళ్లిన సంఘటనలు కూడా ఉన్నాయి. పంటలు చివరి దశలో ఉన్నప్పుడు దొంగలు ఇలా వరుస చోరీలు చేస్తూ హల్‌చల్ చేస్తున్నారు.

నారు పోద్దామంటే స్టార్టర్ లేదు..

వేసవి కాలం కావడంతో స్టార్టర్‌ను చేను వద్దనే ఉంచా. గత వారం క్రితం గుర్తుతెలియని దుండగులు స్టార్టర్‌ను ఎత్తుకెళ్లారు. వ్యవసాయ తరుణం కావడంతో నారుమడి పోయాలి. ఏం చేయాలో అర్థం కావడం లేదు. – వీరయ్య, రైతు, పోచారం

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

- రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
- రూ.10.23 కోట్లతో నిర్మించిన ఐదు ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకుల ప్రారంభం



ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించిన మంత్రి పువ్వాడ, పక్కన మేయర్ నీరజ, కలెక్టర్ గౌతమ్, కమిషనర్ ఆదర్శ్ తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం ప్రజలు ఒకప్పుడు తాగునీటి కోసం ట్యాంకర్లపై ఆధారపడే వారని, వేసవి కాలం వస్తే మహిళలు బిందెలతో రోడ్లపైకి వచ్చే వారని.. కానీ ఇప్పుడు నగరంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణ ప్రగతి దినోత్సవం నిర్వహించారు. ఈమేరకు రూ.10.23 కోట్లతో ఐదు డివిజన్లలో నిర్మించిన ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్‌లను మంత్రి ప్రారంభించారు. 20వ డివిజన్ రామచంద్రయ్యనగర్‌లో రూ.1.80 కోట్లతో నిర్మించిన 10 లక్షల లీటర్ల సామర్థ్యం గల ట్యాంక్, 23వ డివిజన్ ఎస్పీ ఆఫీస్ రోడ్డులో రూ.1.65 కోట్లతో నిర్మించిన 9లక్షల సామర్థ్యం గల ట్యాంక్, 32వ డివిజన్ గుట్టల బజార్‌లో రూ.3.48 కోట్లతో నిర్మించిన 23 లక్షల లీటర్ల సామర్థ్యం గల(బాహుబలి)ట్యాంక్, 53వ డివిజన్ ఎన్నెస్పీ క్యాంపులో రూ.1.80 కోట్లతో నిర్మించిన 10లక్షల లీటర్ల సామర్థ్యం గల ట్యాంక్, 43వ డివిజన్ జెడ్పీ సెంటర్‌లో రూ.1.50కోట్లతో నిర్మించిన 8లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్ హెడ్ ట్యాంక్‌లను మేయర్ పునుకొల్లు నీరజ, కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌తో కలిసి ప్రారంభించి మంత్రి మాట్లాడారు. ఖమ్మం ఎమ్మెల్యేగా తాను బాధ్యతలు చేపట్టే నాటికి సరైన రోడ్లు లేక, తాగునీరు రాక ప్రజలు ఇబ్బంది పడే వారని, కానీ ఇప్పుడు ఇంటింటికీ నీరు అందేలా ట్యాంకులు నిర్మించడంతో పాటు వీడీఎఫ్ పరిజ్ఞానంతో సువిశాలంగా రోడ్లు విస్తరించామని చెప్పారు. కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్లు రాధికా గుప్తా, మయాంక్‌సింగ్, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, బిక్కసాని ప్రశాంతలక్ష్మి, బీ.జీ.క్లెమెంట్, మక్బూల్, దొన్వాన్ సరస్వతి, పగడాల శ్రీవిద్య, కమర్తపు మురళి, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, డీఈ రంగారావు తదితరులు పాల్గొన్నారు. కాగా, ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న 38వ డివిజన్ కార్పొరేటర్ ఆలియా షౌకత్ అలీని మంత్రి పువ్వాడ పరామర్శించారు.

చిరు వ్యాపారులపై ఆగ్రహం..

రోడ్ల వెంట చెత్త వేస్తున్న వ్యాపారులపై మంత్రి పువ్వాడ ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలో మంత్రి పర్యటిస్తున్న క్రమంలో పలుచోట్ల తాటిముంజలు, కొబ్బరి బొండాల వ్యర్థాలను గుర్తించి వాహనం దిగి వ్యాపారులతో మాట్లాడారు. ఖమ్మంను క్లీన్ అండ్ గ్రీన్‌గా మారుస్తున్న క్రమంలో అందరూ సహకరించాలని సూచించారు.

'ఎస్‌బీఐటీ' విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్



ప్లేస్‌మెంట్ లెటర్ అందిస్తున్న మంత్రి అజయ్

ఖమ్మంమయూరిసెంటర్: సీడీఐ ద్వారా శిక్షణ పొందిన ఎస్‌బీఐటీ విద్యార్థుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఏడుగురు విద్యార్థులకు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ చేతుల మీదుగా శుక్రవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో ప్లేస్‌మెంట్ లేటర్లను అందజేశారు. జీవీపీఆర్ ఇంజనీర్స్ లిమిటెడ్‌లో విద్యార్థులకు ప్లేస్‌మెంట్ దక్కినట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐటీ కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ, బీఏఐ ఖమ్మం సెంటర్ చైర్మన్, సీడీఐ డైరెక్టర్ సామినేని వెంకటేశ్వరరావు, బీఏఐ ప్రతినిధులు కనపర్తి సీతయ్య, చల్లపల్లి శ్రీనివాసరావు, బి.సైదారావు, జక్కంపూడి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పంట కాల్వలు దెబ్బతినొద్దు..



పనులను పరిశీలిస్తున్న డీఈఈ మన్మథరావు

నేలకొండపల్లి: జాతీయ రహదారి నిర్మాణ పనులతో పంట కాల్వలు దెబ్బతినకుండా, రైతులు ఇబ్బంది పడకుండా చూడాలని ఇరిగేషన్ నేలకొండపల్లి సబ్ డివిజన్ డీఈఈ మన్మథరావు సూచించారు. శుక్రవారం మండలంలోని పైనంపల్లి, బోదులబండ, కొత్తకొత్తూరు, నేలకొండపల్లి గ్రామాల్లో జరుగుతున్న జాతీయ రహదారి నిర్మాణ పనులను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈమేరకు రహదారి వెంట రెండు చోట్ల కొత్తగా చేపట్టనున్న యూటీ నిర్మాణాలకు సంబంధించి మార్కింగ్‌ను ఇచ్చారు. అనంతరం జాతీయ రహదారి నిర్మాణ పనుల సంబంధిత ప్రతినిధులతో చర్చించి యూటీ నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ తాళ్లూరి నరేష్, లష్కర్ చట్టు వెంకటేశ్వర్లు, నేషనల్ హైవే ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రుణ దరఖాస్తు గడువు పొడిగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహారావు

ఖమ్మంమయూరిసెంటర్: వెనుకబడి తరగతులకు చెందిన వృత్తిదారులకు అందించే రూ.1 లక్ష రుణాల కోసం దరఖాస్తు గడువును పొడిగించాలని బీసీ హక్కుల పోరాట సమితి సీనియర్ నాయకుడు గుడుగు నర్సింహా ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమితీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ రుణాలపై ఈనెల 20వ తేదీ వరకు గడువు విధించారని, ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకున్న ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు రాక లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారన్నారు. రుణ సౌకర్యం కొన్ని కులాలకే పరిమితం చేయడం సరికాదని, బీసీ వర్గాలన్నింటికి వర్తింపజేయాలని కోరారు. బీసీ బంధు పథకాన్ని వర్తింపజేసి రూ.10లక్షలు ఇవ్వడంతో పాటు రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు రూ.1,000 కోట్లకు పెంచాలని డిమాండ్ చేశారు. మేకల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో సీహెచ్.సీతామహాలక్ష్మి, నూనె శశిధర్, పి.వీరభద్రం, జ్వాలా నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలి

ఖమ్మంరూరల్: గత ఎన్నికల సమయంలో రైతులకు ప్రకటించిన రూ.లక్ష రుణమాఫీ తక్షణమే చేయాలని కాంగ్రెస్ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు మొక్క శేఖర్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ప్రకృతి వైపరీత్యాలతో నష్టాల్లో ఉన్న రైతాంగానికి రూ. లక్ష రుణమాఫీ చేసి కేసీఆర్ రైతులను ఆదుకోవాలని, లేదంటే కిసాన్‌సెల్ ఆధ్వర్యాన ఉద్యమిస్తామని హెచ్చరించారు.

కేసులు నమోదు

కూసుమంచి: కూసుమంచికి చెందిన కల్లెపు ఉపేంద్రమ్మను ఆమె సోదరుడు అర్వపల్లి రామకృష్ణ దూషించి నిర్బంధించాడని చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్‌కుమార్ తెలిపారు. అలాగే, మండలంలోని నేలపట్లలో పాత కక్షల నేపథ్యాన ఇరువర్గాల మధ్య ఘర్షణజరగగా ఏడుగురిపై కేసు నమోదైంది. గ్రామానికి చెందిన బొప్పని సురేష్‌పై అదే గ్రామానికి చెందిన అద్దంకి ముత్యాలరావు, నరేష్, భిక్షం దాడి చేయగా బాధితుడి ఫిర్యాదు కేసు నమోదు చేశారు. ఇదే సమయాన తన కటుంబసభ్యులపై బొప్పని సురేష్, జయరాజు, ఆనందరావు, ఏసమ్మ దాడి చేశారని నరేష్ ఇచ్చిన మరో ఫిర్యాదుపై కూడా కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

భాష, సంస్కృతిని రక్షించుకోవాలి..



నిర్వాహకులతో మాట్లాడుతున్న బాపయ్య చౌదరి

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగానగరంలోని లకారం ట్యాంక్‌బండ్‌పై కవి సమ్మేళనంలో భాగంగా పుస్తక ప్రదర్శనను శుక్రవారం ఏర్పాటు చేశారు. పుస్తక ప్రదర్శనను ఉత్తర అమెరికా తెలుగు అసోసియేషన్ అధ్యక్షుడు బాపయ్య చౌదరి సందర్శించిన అనంతరం కవి సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. మన భాషా, సంస్కృతులను రక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఆనందాచారి, సీనియర్ కవి జీవన్, డాక్టర్ పోతగాని సత్యనారాయణ, కె.రమేష్, జిగీ, టి.సుభాషిణి, టి.రాధ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాన్ని రాజకీయం చేయొద్దు



మాట్లాడుతున్న చిన్ని కృష్ణారావు, శ్రీశైలం

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదాన్ని రాజకీయ కోణంలో చూడొద్దని చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు కోరారు. ఖమ్మం శ్రీటౌన్‌లోని వర్తక సంఘం భవనంలో శుక్రవారం చాంబర్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిన్ని కృష్ణారావు, మెంతుల శ్రీశైలం మాట్లాడారు. ఖమ్మం మార్కెట్‌లో 10వ తేదీన జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.50 లక్షల విలువైన పత్తి కాలిపోగా, ప్రమాదవశాత్తుగా జరిగిన ఘటనగా భావిస్తున్నామని తెలిపారు. అయితే, వ్యాపారికి బీమా వర్తించేలా మార్కెట్ కమిటీ కృషి చేస్తోందని చెప్పారు. రైతులు, వ్యాపారులకు మేలు చేసేలా కొనసాగుతున్న చర్యలకు అడ్డంకి ఏర్పడకుండా రాజకీయ ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో సోమా నర్సింహారావు, మన్నెం కృష్ణ, నల్లమల ఆనంద్, చెరుకూరి సంతోష్‌కుమార్, కైలాసపు వేణుగోపాల్‌రావు, పాయల నాగేశ్వరరావు, నేరెళ్ల శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం నగరంలోని టౌన్–1 పరిధిలో ఉన్న 33/11 కేవీ దానవాయిగూడెం సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని సబ్ స్టేషన్ ఏఈ మౌల్విక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దానవాయిగూడెం, సబ్ జైల్ ప్రాంతం, సారధినగర్, వెంకటేశ్వరనగర్, పద్మావతి నగర్, జూబ్లీక్లబ్ రోడ్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

రేపు జీళ్లచెరువు వద్ద తాగునీటి దినోత్సవం



వాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న డీఈఈ

నేలకొండపల్లి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఈ నెల 18న కూసుమంచి మండలంలోని జీళ్లచెరువు వద్ద తాగునీటి దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు మిషన్ భగీరథ డీఈఈ ఓం ప్రకాష్ తెలిపారు. శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాల్లో వాటర్ ట్యాంక్‌లను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతీ పంచాయతీలో వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేయడంతో పాటు పిచ్చిమొక్కలను తొలగించి శానిటేషన్ చేయించాలన్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ చేతుల మీదుగా జీళ్లచెరువు వద్ద తాగునీటి దినోత్సవం వేడుకలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం తాగునీటి వాడకం గురించి క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించనున్న నేపథ్యాన ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

జయప్రదం చేయండి..

ఏఐఎస్ఎఫ్ రాజకీయ శిక్షణ తరగతులు..

ఖమ్మంమయూరిసెంటర్: ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర స్థాయి విద్య, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సంఘ రాష్ట్రసహాయ కార్యదర్శి ఇటికాల రామకృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక గిరిప్రసాద్ భవనంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో శిక్షణ తరగతుల కరపత్రాలను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 26, 27, 28 తేదీల్లో మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా బోడుప్పల్‌లో ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు జరగబోతున్నాయని అన్నారు. ఈ శిక్షణ తరగతుల్లో ప్రభుత్వాల విధానాలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా ఉపాధ్యక్షులు ధర్మవరపు యువరాజ్, శివ, హరికృష్ణ, చందూలాల్, రామారావు, గోపి, వెంకటేష్, నరేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఐలు రాష్ట్ర మహాసభలు..

ఖమ్మంలీగల్: ఈనెల 17,19 తేదీల్లో భువనగిరిలో జరిగే ఐలు మూడో రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఐలు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నల్లమల నవీన్ చైతన్య, చింతనిప్పు వెంకట్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభలకు ఖమ్మం జిల్లా న్యాయవాదులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాస్‌నాయక్

కూసుమంచి: గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఎంపీపీ బానోత్ శ్రీనివాస్‌నాయక్ కోరారు. శుక్రవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని, సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను గడపగడపకు చేరేలా చూడాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి నా దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో పలు శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను సమర్పించగా.. వైస్ ఎంపీపీ రంచర్ల పద్మ, ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గురుపౌర్ణమి ఆహ్వాన పత్రికలు ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం రంగనాయకుల గుట్టపై ఉన్న శ్రీ కృష్ణసాయి ఆశ్రమంలో ఈనెల 23 నుంచి గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నారు. ఈమేరకు ఆహ్వాన పత్రికలను శుక్రవారం నిర్వాహకులు ఆవిష్కరించారు. అనంతరం చైర్మన్ లగడపాటి రామారావు మాట్లాడుతూ గురుపౌర్ణమి సందర్భంగా షిరిడీ సాయి దీక్ష(ఏకాదశ దీక్షలు) మాలధారణ 23వ తేదీన ఉంటుందని తెలిపారు. అలాగే, జూలై 5వ తేదీ వరకు ప్రతిరోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని, ఆశ్రమానికి వచ్చే వృద్ధులు ఆటో సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వహణ కమిటీ ప్రధాన కార్యదర్శి సిద్ధంశెట్టి నాగమణితో పాటు చౌడవరపు మధుసూదన్‌రావు, కొదుమూరి శ్రీనివాస్‌రావు, నరహరి రమేష్‌కుమార్, పుల్లఖండం వెంకటరామారావు, కేతేపల్లి సంజయ్, మార్త నర్సింహారావు, బిజినేపల్లి సుదర్శన్‌గుప్తా, కన్నం రమణ, సిద్ధంశెట్టి శ్రీకాంత్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ జీపుజాతా పోస్టర్లు..



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

ఖమ్మంరూరల్: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, మినీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యాన శుక్రవారం నుంచి ఈనెల 27 వరకు జరిగే జీపుజాతాను జయప్రదం చేయాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పి.రమ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని ఆరెంపుల లోజాతాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని పేర్కొన్నారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీలక్ష్మి, పద్మ, పుష్పావతి, సరిత పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సొంతింటి కల సాకారం



దుర్గాప్రసాద్‌ను సన్మానిస్తున్న నాయకులు

కామేపల్లి (కారేపల్లి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల ఆర్థిక సాయమందించి ప్రతి ఒక్కరి సొంతింటి కల సాకారం చేయనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ అన్నారు. శుక్రవారం కామేపల్లి మండలం పాతలింగాల గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అంతేకాక కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే గ్యాస్ సిలెండర్ ధర రూ. 500లకు వస్తుందని, ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తామని పార్టీ అధిష్టానం చెప్పినట్లు తెలిపారు. ఈ నెలాఖరులో సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క పాదయాత్ర ముగ్గింపు సభకు అందరూ వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఇదిలా ఉండగా.. జూలై -2వ తేదిన రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలకు సంబంధించి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 18 నుంచి 35 ఏళ్ల వయసున్న వాళ్లు పాల్గొనే విధంగా కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, పాలేరు నియోజకవర్గ నాయకుడు రాంరెడ్డి చరణ్‌రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం, జెడ్పీటీసీ బానోత్ వెంకట్ ప్రవీణ్‌కుమార్‌నాయక్‌తో పాటు గింజల నర్సింహ్మారెడ్డి, గోపిరెడ్డి, వీరారెడ్డి, రాంరెడ్డి జగన్నాధరెడ్డి, నల్లమోతు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.